క్లుప్తంగా

వేముల ఎంపీడీఓగా శ్రీకాంత్‌రెడ్డి



ఎంపీడీఓగా బాధ్యతలు చేపడుతున్న బీరం శ్రీకాంత్‌రెడ్డి

వేముల : వేముల ఎంపీడీఓగా బీరం శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్ బదిలీపై జిల్లా పరిషత్ కార్యాలయానికి వెళ్లారు. దీంతో పంచాయతీరాజ్ కమిషనరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న బీరం శ్రీకాంత్‌రెడ్డి బదిలీపై ఎంపీడీఓగా వచ్చారు. ఈయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ సురేష్‌రెడ్డి

పులివెందుల టౌన్ : వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ సురేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని లయోలా కళాశాల విద్యార్థులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బైకు రైడర్లు, పిల్లాన్ రైడర్లు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌లు, కారు డ్రైవర్లు సీట్‌బెల్టు పెట్టుకోకపోవడం వల్ల ఎక్కువ మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ముఖ్యంగా యువత ట్రిపుల్ రైడింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ అమల్‌రాజ్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న ఆర్జేడీ, కళాశాల ప్రిన్సిపాల్ రవి, తదితరులు

వేంపల్లె : ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని వేంపల్లె ఉర్దూ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఆర్జేడీ రవి తెలిపారు. శుక్రవారం స్థానిక ఉర్దూ జూనియర్ కళాశాలలో ఆయన తన సొంత ఖర్చులతో రూ.35 వేలు విలువ చేసే యూనిఫాం దుస్తులను 125 మంది విద్యార్థులకు పంపిణీ చేసి మాట్లాడారు. ఉచితంగా యూనిఫాంతో పాటు నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం నిర్మించిన కళాశాల కార్పొరేట్ కళాశాల కంటే అద్భుతంగా ఉందన్నారు. వేంపల్లెలో ఉన్న ఉర్దూ జూనియర్ కళాశాలలాగా జిల్లాలోనే ఏ కళాశాల లేదన్నారు. ఉర్దూ కళాశాలలో మంచి నాణ్యతగల విద్యను అందించేందుకు అధ్యాపకులు కూడా ఉన్నట్లు తెలిపారు. అనంతరం ఆర్ఐఓ వెకటసుబ్బయ్య చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫాం, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

డిపో మేనేజర్ రామకృష్ణ

పులివెందుల రూరల్ : పులివెందుల ఆర్టీసీ డిపో పరిధిలోని శుక్రవారం నిర్వహించిన డయల్ యువ ర్ డీఎం కార్యక్రమంలో 26 మంది ప్రయాణికులు తమ సమస్యలను తెలిపినట్లు డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో 5 మంది ప్రయాణికులు పులివెందుల నుంచి కర్నూలుకు వయా తాడిపత్రి మీదుగా బస్సులను నడపాలని కోరారు.

మరికొంత మంది ప్రయాణికులు బస్సుల పరిశుభ్రతను మెరుగుపరచాలన్నారు. పులివెందుల నుంచి ధర్మవరానికి వయా ముదిగుబ్బ మీదుగా, లింగాల మీదుగా బస్సులను నడపాలని కోరారు. పులివెందుల నుంచి ఆర్.తుమ్మలపల్లి స్టేజికి రూ.20లు వసూల్ చేస్తున్నారని రూ.10 ఛార్జ్ చేయాలని కోరా రు. పులివెందుల నుంచి ముదిగుబ్బ, మొలకల చెరువు, చింతామని మీదుగా బెంగుళూరుకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. పులివెందుల నుంచి ఇడుపులపాయకు వేంపల్లె మీదుగా బస్సును పునరుద్ధరించాలన్నారు. పులివెందుల పాత బస్టాండు నుంచి కొత్త బస్టాండుకు వచ్చేటప్పుడు కొన్ని బస్సు లు మెయిన్ బజార్‌లోనూ, మరికొన్ని శ్రీరామ హాల్ రూట్‌లో వస్తున్నాయని వాటిని ఒకే రూట్‌లో వచ్చే విధంగా చూడాలని కోరారు. పులివెందుల నుంచి కడపకు రాత్రి సమయంలో 9.30 గంటలకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలన్నారు. సింహాద్రిపురం నుంచి ముదిగుబ్బకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ప్రయాణికులు అడిగినట్లు అన్ని చోట్లకు బస్సు సౌకర్యాలు ఏర్పాటు చేసేవిధంగా అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఈ-క్రాప్‌పై నీలినీడలు

- పంట నమోదుపై ఇంకా ప్రకటన చేయని చంద్రబాబు సర్కార్
- గత ప్రభుత్వంలో అత్యంత పారదర్శకంగా పంట నమోదు
- ఈ-క్రాప్ ప్రామాణికంగా రైతులకు విరివిగా ప్రయోజనాలు
- ఇన్‌పుట్, ఇన్సూరెన్స్, ఎంఎస్‌పీ, సున్నావడ్డీ తదితర ఫలాలు



ఎర్రగుంట్ల మండలంలో ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఎర్రగుంట్ల : కులమతాలు, పార్టీలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి రైతుకూ ఎంతో ప్రయోజనకారిగా ఉన్న ఈ-క్రాప్ (పంట నమోదు) వ్యవస్థపై నీలినీడలు కమ్ముకున్నాయి. నెలన్నర కిందట ఏర్పాటైన చంద్రబాబు సర్కార్ దీనిపై ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికే ఖరీఫ్ ఆరంభమై రెండు నెలలు కావస్తోంది. అరకొర వర్షాలకు మందకొడిగా ఏరువాక కొనసాగుతోంది. మండల పరిధిలో 1400 హెక్టార్ల వరకు పంటలు వేశారు. సాగు చేసిన అన్ని రకాల వ్యవసాయ, ఉద్యాన పంటల వివరాలు ఈ-క్రాప్ కింద ఆన్‌లైన్ చేయాల్సివుంది. సాగు చేసిన ప్రతి పంట పొలాలను ఈ-క్రాప్ బుకింగ్ చేయడంతో పాటు సదరు రైతుల బయోమెట్రిక్‌తో ఈకేవైసీ చేయాల్సివుంది. ఏటా జూలై రెండో పక్షం నుంచి ప్రత్యేక యాప్ ద్వారా మొదలు పెట్టి సెప్టంబర్ ఆఖరు వరకు కొనసాగిస్తూ వచ్చారు. పారదర్శంగా ఉండటంతో రైతులు కూడా పంట నమోదుకు బాగా ఆలవాటు పడ్డారు. అయితే వ్యవసాయశాఖ ఇప్పటి వరకూ పంట నమోదు ప్రక్రియ చేపట్టక పోవడంతో ఈ-క్రాప్ బుకింగ్, ఈకేవైసీపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ-క్రాప్ లేకపోతే పంటల వారీగా ఖచ్చితమైన సాగు విస్తర్ణం, వాటికి అనుగుణంగా విత్తన ప్రణాలికలు, పంటల వైవిధ్యం, పథక నిర్దేశన చేయడం కూడా కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఈ-క్రాప్‌తో వ్యవసాయంలో విప్లవాత్మకంగా మార్పులకు నాంది..

గత ఐదేళ్ల అధికారంలో ఉన్న జగన్ సర్కార్ దేశంలో మరెక్కడా లేని విధంగా వ్యవసాయంలో విప్లత్మకంగా మార్పులు తీసుకువచ్చింది. గ్రామ గ్రామాన ఆర్బీకే వ్యవస్థ ఏర్పాటు చేసిన అదే వేదికగా గ్రామం దాటి వేళ్లే అవసరం లేకుండా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతరత్రా ఇన్‌పుట్స్ అందించేలా చర్యలు తీసుకుంది. అలాగే సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ బుకింగ్ చేపట్టి దాని ఆధారంగా రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహక రాయితీలు, పథకాలు వర్తింప చేసింది. దీంతో అర్హత కల్గిన ప్రతి రైతూ ప్రయోజనం పొందారు. ఈ కార్యక్రమం అత్యంత పారదర్శకంగా చేపట్టడంతో దేశంలో పలు రాష్ట్రాలు సైతం ఈ-క్రాప్ వ్యవస్థను మెచ్చుకున్నాయి.

నాడు రూ.కోట్లలో లబ్ధి..

ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోతే ఈ-క్రాప్ ఆధారంగా అర్హత కలిగిన రైతులకు పెట్టుబడి రాయిత(ఇన్‌పుట్ సబ్సిడీ) అప్పట్లో జగన్ సర్కార్ అందజేస్తూ వచ్చింది. ఉచిత పంటల బీమా పథకంతో గుర్తించిన పంటలు సాగు చేసిన రైతులకు బీమా పరిహారం కింద అందించారు. పండించిన పంటలకు బహిరంగ మార్కెట్లో గిట్టుబాటు ధర లేకపోతే కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)తో నోడల్ ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేశారు. బ్యాంకుల ద్వారా రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులకు ఈ-క్రాప్ ఆధారంగా పంట రుణాల సున్నా వడ్డీ పథకం కింద వడ్డీ జమ చేశారు. ఖరీఫ్, రబీలో విత్తన పంపిణీకి వీలుగా రైతుల నుంచి గిట్టుబాటు ధరతో విత్తన సేకరణ చేశారు. ఇలా గత ప్రభుత్వం అమలు చేసిన పలు పథకాలకు ఈ-క్రాప్‌నే ప్రామాణీం కావడం గమనార్హాం. ఇంతటి మహత్తర కార్యక్రమాన్ని కొనసాగించాల్సిన చంద్రబాబు సర్కార్ ఇంకా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ప్రకటన రాలేదు..



ఈ విషయంపై వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈ-క్రాప్ బుకింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. ప్రకటన వచ్చిన వెంటనే ఈ-క్రాప్ బుకింగ్ మొదలు పెడుతాం. రైతులు ఇప్పటి కొన్ని ప్రాంతాలలో మినుము పంటను దున్నేస్తున్నారని తెలిసింది. ఈ-క్రాప్‌తోనే రైతులకు అన్ని ప్రయోజనాలు చేకూరుతాయి.

– శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ అధికారి ఎర్రగుంట్ల

ఉల్లితోట పరిశీలన



ఉల్లిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తొండూరు : మండలంలోని బూచుపల్లి, భద్రంపల్లి గ్రామాల్లో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి ప్రధాన శాస్త్రవేత్త తాగూర్‌నాయక్, జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణిలు గ్రామంలోని ఉల్లి పంటలను పరిశీలించారు. గత నెలలో కొన్ని ప్రైవేట్ కంపెనీ నుంచి తెచ్చుకున్న ఉల్లి విత్తనాలు నకిలీవని తేలడంతో శాస్త్రవేత్తలు పరిశీలించారు. వారి దగ్గరున్న శాంపిల్ విత్తనాలను తీసుకుని ల్యాబ్‌లో పరీక్షించారు. అధికారుల సిఫారసుల మేరకు సూచించిన ఎరువులు వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

జమ్మలమడుగు : మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న మురికికాలువల పూడిక తీత పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మురికి కాలువల్లోని నీరు రోడ్లపైకి రాకుండా పూడిక తీత పనులను చేపట్టామన్నారు. ప్రజలు చెత్తను కాలువల్లో వేయకూడదని సూచించారు.

పంటలలో పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

చింతకొమ్మదిన్నె : పంటలలో అక్కడక్కడ పక్షిస్థావరాలను ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని రసూల్‌పల్లె రైతు సేవాకేంద్రం పరిధిలోని పత్తి రైతు లక్ష్మిరెడ్డి పంటను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పలువురు రైతులకు సంబంధించిన ప్రతి పంటను సందర్శించి ప్రతి పంటలో తెల్ల దోమ, మెగ్నీషియం లోపాలను గుర్తించామన్నారు. వాటిని నివారించేందుకు పసుపు రంగు జిగురు అట్టలను ఎకరానికి 8 నుంచి 10 పెట్టుకోవాలన్నారు. ఈమెడలోపెడ్ మందును 0.4 ఎంఎల్ ఒక లీటరు నీటికి లేదా అసిటామి ప్రిడ్ 0.2 గ్రాములకు ఒక లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు. మెగ్నీషియం లోపానికి మెగ్నీషి యం సల్ఫేట్ ఐదు గ్రాములకు ఒక లీటరు నీటిని కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే పత్తి పంటను ఆశించే పురుగులను క్రమబద్ధీకరించేందుకు పంటలో అక్కడక్కడ కొన్ని పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే ఈశ్వర్ రెడ్డి, రైతు సేవా కేంద్రం సి బ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈనెల 31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

జమ్మలమడుగు రూరల్ : ఈనెల 31వ తేదీన పాలిటెక్నిక్ అడ్మిషన్లు జరుగనున్నట్లు జమ్మలమడుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సురేంద్రనాథ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ ద్వారా పాలిటెక్నిక్‌లో సీట్ పొందవచ్చునన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 29వ తేదీలోపల దరఖాస్తుతోపాటు సంబంధిత సర్టిఫికేట్ల జిరాక్స్ కాపీలను జతచేసి కళాశాలల్లో అందజేయాలన్నారు. సీటు పొందిన వారు రూ.5,800 ఫీజు చెల్లించవలసి ఉంటుందన్నారు. స్పాట్ అడ్మిషన్‌కు వచ్చే విద్యార్థులు అన్ని ఓరిజనల్ సర్టిఫికెట్లతో పాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలను తప్పకుండా తీసుకురావాలన్నారు. కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ బ్రాంచీల్లో సీట్లు ఉన్నాయన్నారు. వివరాలకు 7901620171 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

పత్తిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ రమేష్

లింగాల : మండలంలోని కామసముద్రం రైతు భరోసా కేంద్ర పరిధిలోని రామాపురంలో ఖరీఫ్ కింద సాగుచేసిన పత్తిపంటలను శుక్రవారం ఏఓ రమేష్ పర్యవేక్షించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలలో యాజమాన్య సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రస్తుతం పత్తి పంట 50 నుంచి 60 రోజుల దశలో ఉందని ఈ సమయంలో రసం పీల్చే తామర పురుగు ఉధృతి, పేనుబంక ఉన్నట్లు గుర్తించారు. తామర పురుగు రసం పీల్చేయడం వల్ల ఆకుముడత వస్తుందని, నివారణకు వేపనూనె 1 లీటరు నీటికి 5 ఎంఎల్ పిప్రొనిల్ 2 ఎంఎల్ లేదా తయోమిథాక్సిన్ 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. పేనుబంక ఉధృతి గమనించినట్‌లైతై 5 శాతం వేపాకు కషాయాన్ని పిప్రోనిల్ 2 ఎంఎల్ 1 లీటరు నీటికి లేదా హిమిడాక్లోప్రిడ్ 0.25 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే గులాబీ రంగు పురుగు ముందుజాగ్రత్త చర్యగా పత్తిపంటలో ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు అమర్చడం ద్వారా మగపురుగును ఆకర్షించి తదుపరి సంతాన ఉత్పత్తిని తగ్గిస్తుందన్నారు. ఒకవేళ గులాబీ రంగు పురుగు ఉధృతి గమనించినట్‌లైతై లీటరు నీటికి 5 ఎంఎల్ వేప నూనెను ప్రొపినోపాస్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో కామసముద్రం రైతు భరోసా కేంద్ర ఇన్‌చార్జి హరితకుమారి రైతులు పాల్గొన్నారు.

11 గంటలైనా.. తెరుచుకోని పశువైద్యశాల



వేముల : స్థానిక పశువైద్యశాల శుక్రవారం ఉయదం 11 గంటలు అవుతున్నా తెరుచుకోలేదు. ఇక్కడ పశువైద్యశాలలో పనిచేస్తున్న వైద్యురాలు సెలవులో ఉన్నారు. దీంతో ఇక్కడ గొల్లలగూడూరులో పనిచేస్తున్న పశు వైద్యురాలు ఇన్‌చార్జిగా నిర్వహిస్తున్నారు. అయితే శుక్రవారం 11 గంటలు అవుతున్నా పశువైద్యశాల తలుపులు తీయలేదు. రైతులు, గొర్రెల కాపరులు పశువైద్యశాలకు వచ్చి వేచి ఉన్నా ఎవరూ ఎంతసేపటికి రాకపోవడంతో వెనుతిరిగారు. సకాలంలో పశువులకు, గొర్రెలకు, మేకలకు వైద్య సేవలు అందడంలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది కూడా విధులకు హాజరుకాకపోవడం, తలుపులు తీయకపోవడంతో పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువైద్యశాల ఉండి కూడా సేవలు అందకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సేవాదృక్పథం అలవరచుకోవాలి

పులివెందుల రూరల్ : ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరు సేవాదృక్పథం అలవరచుకోవాలని పులివెందుల తాలూకా (ఈడిగ) గౌడ సంఘం సంక్షేమ అధ్యక్షుడు శేషయ్యగౌడ్ తెలిపారు. పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డులో ఉంటున్న శ్రీనివాసులు అనే వ్యక్తికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం గౌడ సంఘం ఆధ్వర్యంలో రూ.20వేలు నగదును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ సంఘంలోని సభ్యులకు ఏ సమస్య వచ్చినా వారికి సంఘం తరఫున అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్ గౌడ్, శ్రీనివాసులు గౌడ్, పుల్లయ్యగౌడ్, నారాయణస్వామి, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి

వీరపునాయునిపల్లె : రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం రైతు సేవా కేంద్రం సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలపై తీసుకోవాల్సిన చర్యలపై వారికి తగు సలహాలు సూచనలు అందించాలని తెలియజేశారు. కౌలు రైతులను గుర్తించడంతో పాటు వారికి సకాలంలో పంట సాగు హక్కు పత్రాలను అందించాలన్నారు. అలా చేయడం వలన కౌలు రైతులకు పంట నష్ట పరిహారం, పంటల బీమా పొందేందుకు అర్హులవుతారన్నారు. అనంతరం గోనుమాకులపల్లెలో సాగులో ఉన్న వేరుశనల పంట, ఉరుటూరు గ్రామంలో సాగులో ఉన్న మినుము పంటలను పరిశీలించారు. బెట్ట పరిస్థితులు తట్టుకోవడానికి 20 గ్రాములు యూరియా లేదా 15-15-15 5 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలపి పంటపై పిచికారి చేయాలన్నారు. వేరుశనగ పంటలో లద్దె పురుగు ఉధృతిని తగ్గించేందుకు థయోడికార్బ్ 200గ్రా, లేదా ఫ్లూబెండమైడ్ 40 మి.లీ, 2 వందల లీటర్లలో కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాజధాని లేదని ఇప్పుడు గుర్తొచ్చిందా నిర్మలమ్మా..!



స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు పైడిపల్లి కిషోర్

పులివెందుల : బీజేపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాజధాని లేని రాష్ట్రమని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలమ్మకు ఇప్పుడు గుర్తొచ్చిందా అని స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు పైడిపల్లి కిషోర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రస్తావన ఉటంకిస్తూ ఏపీ రాజధాని నిర్మాణం కోసం రూ.15 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే ఆ సొమ్ము అప్పుగా ఇస్తారా... లేక గ్రాంటుగా ఇస్తారా అన్న అంశంపై స్పష్టత లేదన్నారు. 2014, 2019, తిరిగి 2024లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగా, రాష్ట్ర విభజన అనంతరం 2014లో టీడీపీ అధికారం చేపట్టిందన్నారు. అప్పట్లో రాజధాని నిర్మాణం కోసం అమరావతిలో ప్రధాని మోదీ పిడికెడు మట్టి, ముంతెడు నీళ్లు తీసుకొచ్చి ప్రారంభోత్సవంలో పాల్గొన్న విషయాన్ని కిషోర్ గుర్తు చేశారు. ఈ పదేళ్ల బీజేపీ పాలనలో అమరావతి రాజధాని నిర్మాణం ఏమైందని ప్రశ్నించారు. విభజన అంశాలు నెరవేర్చడంతో పాటు రాజధాని నిర్మాణానికి నిధుల కేటాయింపుపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆ దిశగా కేంద్రం స్పందిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

వైభవంగా చౌడేశ్వరిదేవికి సారె



పురవీధుల గుండా సారె తీసుకువెళ్తున్న మహిళలు

జమ్మలమడుగు : తొగటవీర క్షత్రియులకు ఆరాధ్య దైవమైన చౌడేశ్వరిదేవికి కుటుంబ సమేతంగా మహిళలు అమ్మవారికి సారె చీరలు తీసుకెళ్లారు. ఆషాఢమాసంలో తమ ఇలవేల్పు అయిన చౌడేశ్వరి దేవికి చీరె పెట్టడం ఆనావాయతీ కాడంతో పట్టణంలోని తొగటవీర క్షత్రియులందరూ అమ్మవారి కీర్తనలు పాడుకుంటూ పురవీధుల గుండా వెళ్లి నాగుల కట్టలోని చౌడేశ్వరిదేవికి సారె చీరెలను సమర్పించారు.

డెంగీ నివారణే ఉత్తమ రక్షణ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కమలాపురం : డెంగీ నివారణే ఉత్తమ రక్షణ అని పెద్దచెప్పలి మెడికల్ ఆఫీసర్ జావలి ప్రసూన తెలిపారు. శుక్రవారం పెద్దచెప్పలి పీహెచ్‌సీ పరిధిలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. డెంగీ నివారణకు ఉత్తమ రక్షణే మార్గం అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా వ్యాధులు వచ్చిన తర్వాత వైద్యం కోసం పోవడం కంటే వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టడమే మంచిదన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. నీరు నిల్వ ఉన్న పాత్రలన్ని కడిగి శుభ్రం చేసి ఆరబెట్టాలన్నారు. రాత్రిళ్లు దోమతెరలు తప్పని సరిగా వాడాలన్నారు. చీకటి పడగానే దోమలు రాకుండా తలుపులు, కిటికీలు మూసివేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్, సూపర్‌వైజర్ విజయకుమారి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూలో విభాగాల తనిఖీ

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలోని 3డీ ల్యాబ్‌ను, వసతిగృహాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, రుచి గురించి అడిగి తెలుసుకున్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపు ణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపా యి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు.

కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించి ప్రముఖ షుగర్ స్పెషలిస్టు డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డిచే సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునే వారు పరగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9703622831, 08568286189 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

హడలెత్తిస్తున్న వీధికుక్కలు

- రోడ్లపై గుంపులు గుంపులుగా సంచారం
- చిన్నారులు, వృద్ధులపై దాడులు



ఇస్లాంపురంలో సంచరిస్తున్న కుక్కలు

పులివెందుల రూరల్ : నియోజకవర్గ వ్యాప్తంగా మున్సిపాలిటీ, మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. మున్సిపాలిటీ, గ్రామాల్లో ఎక్కడ చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ పిల్లలు, వృద్ధులతో పాటు వాహనదారులను వెంబడించి పరుగులు పెట్టుస్తున్నాయి. రాత్రి వేళల్లో మనుషులు కనిపిస్తే చాలు దాడి చేసి గాయపరుస్తున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో ఏదో ఒక చోట చిన్నపిల్లలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి.

రెబీస్ ప్రమాదకరం..

కుక్కలు కరిచినప్పుడు రెబీష్ అనే వ్యాధి సోకితే శరీరంలోని నరాల వ్యవస్థ మొత్తం దెబ్బతిని చివరకు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుంది. రెబీష్ సోకిన వారిలో కొందరు మంచి నీళ్ల తాగడానికి భయపడిపోతారు. ఈ లక్ష్యణాన్ని వైద్య భాషలో హైడ్రోఫోబియా అంటారు. రోగి నీళ్ల తాగకపోవడంతో డీ హైడ్రేషన్‌కు గురై మరణం సంభవిస్తుంది.

పేరుకే ఏబీసీ... అమలు ఎక్కడ...?

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలను వెంటాడి కర్రలతో కొట్టి చంపేవారు. తర్వాత కొంత మంది జంతు ప్రేమికులు స్వచ్ఛంద సంస్థలు, న్యాయస్థానాలు ఆశ్రయించడంతో వాటిని చంపడం నేరమని తీర్పును ఇచ్చింది. తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక ప్రత్యేక పథకం ద్వారా కుక్కల సంతతిని నియంత్రించేందుకు శ్రీకారం చుట్టారు. అదే యాంటీబర్త్ కంట్రోల్ (ఏబీసీ) దీని ద్వారా మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు చేసి ఆడకుక్కలకు గర్భసంచి తీసివేస్తారు. ఈ పథకం ద్వారా కుక్కలు అరవడం, కరవడాన్ని నియంత్రించవచ్చు. ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరగా ఏబీసీ వ్యాక్సిన్ కోసం ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపామని, వచ్చిన వెంటనే వ్యాక్సిన్ వేసి చర్యలు తీసుకుంటామన్నారు.

కుక్కలపట్ల జాగ్రత్తలు పాటించాలి



ప్రస్తుత వర్షాకాలం కావడంతో కుక్కలు ఎక్కడపడితే అక్కడ వీధుల్లో సంచరిస్తూ చిన్నపిల్లలను, వృద్ధులను కరుస్తున్నాయి. కుక్కల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. పులివెందుల మున్సిపాలిటీలో కుక్కల సంచారం కూడా రోజురోజుకు పెరిగిపోతోంది. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలి.

– మాధవాచారి, పులివెందుల

కుక్కలను దూరప్రాంతాలకు తరలించాలి



గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కుక్కలను పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించాలి. గ్రామాల్లో చిన్నపిల్లలతో పాటు వృద్ధులను, మహిళలను కరుస్తున్నాయి. అందువల్ల అధికారులు స్పందించి గ్రామాల్లో ఉన్న వీధికుక్కలను సైతం దూరప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలి.

– హనుమంతురెడ్డి, తొండూరు మండలం